## ఆర్డీవో కార్యాలయం తనిఖీ



**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో,( రాధారపు నర్సయ్య ):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న వివిధ రెవెన్యూ అంశాలను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. జాతీయ రహదారి పనులకు సంబంధించిన అవార్డు కాపీలను రైతులకు ఆలస్యం లేకుండా అందించాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలపై ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. మీసేవ ద్వారా వచ్చే సర్టిఫికెట్లను పెండింగ్‌లో ఉంచకుండా సమయానికి జారీ చేయాలని స్పష్టం చేశారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి ఓటరు ఖచ్చితంగా మ్యాప్ అయ్యేలా ప్రతి ఇంటి నుంచి స్పష్టమైన, నిర్దిష్టమైన వివరాలు సేకరించాలని తెలిపారు. అన్ని స్థాయిల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్, తహసీల్దార్లు రామ్మోహన్, వరందన్ మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మైనారిటీల ఆర్థికాభివృద్ధికి రెండు ప్రత్యేక పథకాలు అమలు



**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో,( రాధారపు నర్సయ్య ):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి రెండు ముఖ్యమైన పథకాలను అమలులోకి తీసుకువచ్చినట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి ఆర్.ఎస్. చిత్రు తెలిపారు. తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. రాళ్లు కత్తిరించే వృత్తిలో నిమగ్నమైన పేద తుర్కా కాశా ముస్లిం వర్గానికి చెందిన లబ్ధిదారుల పునరావాసం, జీవనోపాధి మెరుగుదల లక్ష్యంగా టూల్‌కిట్లు మరియు జనరేటర్ల పంపిణీ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ప్రతి లబ్ధిదారునికి రూ.60,000/- విలువైన సహాయాన్ని 100 శాతం సబ్సిడీతో ఒకేసారి అందజేయనున్నారు. ఇందులో రూ.10,000/- విలువైన టూల్‌కిట్ మరియు రూ.50,000/- విలువైన జనరేటర్ ఉంటాయి. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే వారు తుర్కా కాశా ముస్లిం కమ్యూనిటీ సర్టిఫికేట్ (సంబంధిత సంఘం ద్వారా జారీ చేయబడినది), ఆధార్ కార్డు, రేషన్ కార్డు సమర్పించాలి. దరఖాస్తుదారుని వయస్సు 21 నుండి 55 సంవత్సరాల మధ్య ఉండాలి. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.00 లక్షల లోపు ఉండాలి. గత ఐదేళ్లలో తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఎటువంటి ఆర్థిక సహాయం పొందకపోయినట్లుగా స్వీయ ధృవీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. మైనారిటీ యువత ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు ఉపాధి అవకాశాలు పొందేందుకు ఈ-స్కూటర్ల పంపిణీ పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ పథకం కింద ప్రతి యూనిట్ వ్యయం రూ.1.50 లక్షలు కాగా, అందులో 80 శాతం అంటే రూ.1.20 లక్షలను ప్రభుత్వం సబ్సిడీగా అందిస్తుంది. మిగిలిన 20 శాతం అంటే రూ.30,000/- లబ్ధిదారుడు స్వయంగా భరించాల్సి ఉంటుంది. ఎంపికైన లబ్ధిదారులను ఉబర్, రాపిడో, ఓలా వంటి సేవా సంస్థలతో అనుసంధానం చేసి ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ పథకానికి 21 నుండి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువత అర్హులు. కనీస విద్యార్హతగా 10వ తరగతి ఉత్తీర్ణత (.0మెమో), చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ (జీరో కేసులు), పాన్ కార్డు తప్పనిసరి. అలాగే ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం మరియు గత ఐదేళ్లలో ఆర్థిక సహాయం పొందలేదని స్వీయ ధృవీకరణ పత్రం సమర్పించాలి. పాస్‌పోర్ట్ సైజు ఫోటో కూడా తప్పనిసరి. ఈ రెండు పథకాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు 20-02-2026 ఉదయం 10:30 గంటల నుండి 01-03-2026 రాత్రి 11:59 గంటల వరకు TGOBMMS httptsobmmscgggovin ద్వారా స్వీకరించబడతాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అనంతరం సంబంధిత సర్టిఫికెట్లతో కూడిన హార్డ్ కాపీలను సంబంధిత ఎంపీడీవో లేదా మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించాలి. జగిత్యాల జిల్లాలోని అర్హులైన తుర్కా కాశా ముస్లింలు మరియు మైనారిటీ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి ఆర్.ఎస్. చిత్రు విజ్ఞప్తి చేశారు.

## చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ల బాధ్యతల స్వీకరణ





**నేటి సాక్షి ,మక్తల్:** మక్తల్ మున్సిపల్ చైర్‌లపర్సన్‌గా వాకిటి మానస హన్మంతు, వైస్ చైర్‌పర్సన్‌గా కుమారి శైవీ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తన సతీమణి లలితతో కలిసి హాజరయ్యారు. కార్యాలయంలో ప్రత్యేక పూజల అనంతరం బాధ్యతలు చేపట్టిన ఇరువురిని మంత్రి అభినందించి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలరాజు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోరుట్ల మున్సిపాలిటీలో సర్వమత సమన్వయానికి నాంది



- చైర్ పర్సన్ వసంత-గంగాధర్..వైస్ చైర్మన్ షాహిదూల్ అహద్‌కు ఘనంగా సర్వమత పూజలు

**నేటి సాక్షి - కోరుట్ల,( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల మున్సిపాలిటీలో నూతన పాలనకు శుభారంభంగా సర్వమత సమన్వయానికి ప్రతీకగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వివిధ మతాల ప్రతినిధులు ఏకవేదికపై చేరి నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఆశీర్వాదాలు అందించడం విశేషం. మున్సిపల్ చైర్మన్ గంగాధర్ వసంత, వైస్ చైర్మన్ షాహిదూల్ అహద్‌లకు పట్టణంలోని హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాల ప్రతినిధులు ఘన స్వాగతం పలికి ఆశీర్వాదాలు అందించారు. హిందూ సంప్రదాయం ప్రకారం పూజారి వేద మంత్రోచ్ఛారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముస్లిం మతాన్ని ప్రతినిధ్యం వహించిన మౌలానా ప్రత్యేక దువాలు చేసి, పట్టణంలో శాంతి, సామరస్యాలు నెలకొనాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ సమాన న్యాయం అందేలా పాలన సాగాలని కోరారు. క్రైస్తవ మతానికి చెందిన చర్చి ఫాదర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, నూతన నాయకత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. మతభేదాలకు అతీతంగా సేవాభావంతో ముందుకు సాగాలని సూచించారు. మతభేదాలకు అతీతంగా ప్రజలందరికీ సమాన న్యాయం, అభివృద్ధి అందించాలన్న సంకల్పాన్ని ఈ సర్వమత పూజలు చాటిచెప్పాయని స్థానికులు కొనియాడారు. పట్టణ అభివృద్ధే ప్రధాన లక్ష్యమని, ఐక్యతతో ముందుకు సాగుతామని చైర్మన్ గంగాధర్ వసంత, వైస్ చైర్మన్ షాహిదూల్ అహద్ తెలిపారు. సర్వమత సమభావాన్ని ప్రతిబింబించిన ఈ కార్యక్రమం కోరుట్ల పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, ప్రజల్లో విశేష స్పందనను పొందింది.

# కోరుట్ల ఆర్టీసీ సిబ్బందిపై ఆగంతకుల దాడి..

- అల్లరిమూకల దౌర్జన్యం
- మహిళా ప్రయాణికులపై అసభ్య ప్రవర్తన
- అడ్డుకున్న డ్రైవర్-కండక్టర్లపై దాడి..బూతుపురాణం
- ముగ్గురు యువకులపై కేసు నమోదు



**నేటి సాక్షి - కోరుట్ల,(రాధారపు నర్సయ్య):** కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామంలో ఆర్టీసీ బస్సును అడ్డగించి సిబ్బందిపై దాడి చేయడంతో పాటు మహిళా ప్రయాణికులతో అసభ్యంగా ప్రవర్తించిన ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. డ్రైవర్-కండక్టర్ లిద్దరూ ధైర్యంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కండక్టర్ ఫిర్యాదు మేరకు ముగ్గురు యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోరుట్ల నుంచి యూసుఫ్ నగర్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అయిలాపూర్ గ్రామానికి చేరుకోగా, అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు తమ మోటార్ సైకిల్‌ను బస్సుకు అడ్డంగా పెట్టి నిలిపివేశారు. బస్సు డ్రైవర్ వాహనాన్ని పక్కకు జరపాలని సూచించగా, ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న యువకులు కొద్దిసేపటి తర్వాత బస్సులోకి ఎక్కి గొడవకు దిగారు. అయిలాపూర్ కు చెందిన లింగంపల్లి రాహుల్, నల్ల రక్షక్, మారంపల్లి వినయ్ అనే యువకులు బస్సులోకి వెళ్లి డ్రైవర్‌పై చేతులతో దాడి చేసి, బూతులు తిట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో డ్రైవర్, కండక్టర్ విధులకు ఆటంకం కలిగింది. ఫిర్యాదుదారుడు ఎర్రోళ్ల వేణుగోపాల్ (53), రేకుర్తి గ్రామం, కరీంనగర్ జిల్లా నివాసి. ఆయన ఆర్టీసీలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డ్రైవర్‌గా భూపాల వంశీకృష్ణ పనిచేస్తున్నారు. ఇదే సమయంలో, అయిలాపూర్ నుంచి వస్తున్న బస్సును మధ్యలో కొంతమంది అల్లరిమూకలు ఆపి బస్సులోకి ఎక్కి మహిళలు, అమ్మాయిలతో అసభ్యంగా ప్రవర్తించినట్లు సమాచారం. మాటలతో వేధింపులకు పాల్పడటంతో పాటు కొంతమంది ప్రయాణికులపై దాడి చేసారు. అల్లరిమూకల అల్లరితో బస్సులో భయాందోళనలు నెలకొన్నాయి. బస్సులో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితిని గమనించిన డ్రైవర్, కండక్టర్ ధైర్యంగా స్పందించి అల్లరిమూకలను అడ్డుకుని బస్సు నుంచి దించివేశారు. ప్రయాణికుల భద్రతను కాపాడుతూ పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. వారి బాధ్యతాయుత వ్యవహారాన్ని ప్రయాణికులు ప్రశంసించారు. ఈ ఘటనపై కండక్టర్ ఫిర్యాదు మేరకు ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు కోరుట్ల ఎస్సై చిరంజీవి తెలిపారు. మహిళలపై దాడులు, వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఇందిరమ్మ పథకంతో నిరుపేద కుటుంబానికి సొంతిల్లు





- 16వ వార్డులో గృహప్రవేశం - లబ్ధిదారులకు నూతన వస్త్రాల పంపిణీ

**నేటి సాక్షి - కోరుట్ల,( రాధారపు నర్సయ్య ):** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఇల్లు లేని నిరుపేద కుటుంబానికి మంజూరైన గృహం పూర్తి కావడంతో 16వ వార్డులో గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశాన్ని ప్రారంభించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మంజూరైన ఇల్లు నిర్మాణం పూర్తవడంతో లబ్ధిదారుల కుటుంబంలో ఆనందం నెలకొంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఇల్లు లేని ప్రతి నిరుపేదకు సొంత గృహం కల్పించడమే లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో 16వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బలిజ రాజారెడ్డి పాల్గొని, 'సదా మీ సేవలో..' అని ప్రజలకు హామీ ఇచ్చారు. పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేద కుటుంబానికి సొంత గృహం కలగడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ బోధనలు సమాజానికి మార్గదర్శకం

## జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్





**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో,( రాధారపు నర్సయ్య ):** తెలంగాణ ప్రభుత్వం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సాంప్రదాయాలు, సంస్కృతులను కాపాడుకుంటూ అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలోచనలు, బోధనలు గిరిజన జాతులకు అపారమైన స్ఫూర్తినిచ్చాయని పేర్కొన్నారు. చెడు అలవాట్లను విడిచిపెట్టి మంచి అలవాట్లను అలవర్చుకోవాలని, ఉన్నతమైన జీవన విధానాన్ని అవలంబించేందుకు మంచి సంస్కృతులు, సాంప్రదాయాలను కొనసాగించాలని కోరారు. జయంతి వేడుకల్లో భాగంగా గిరిజన సాంప్రదాయ వేషధారణలో చిన్నారులు నృత్య ప్రదర్శనలు చేసి అందరిని ఆకట్టుకున్నారు. కళాకారుల పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు చేసిన చిన్నారులను జిల్లా కలెక్టర్ శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కె. రాజ్ కుమార్, జిల్లా అధికారులు, గిరిజన సంఘ నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మక్తల్‌లో 'సీఎం కప్' కబడ్డీ పోటీలు ప్రారంభం





**నేటి సాక్షి,నారాయణపేట:** నారాయణపేట జిల్లా మక్తల్ వేదికగా 'సీఎం కప్' సెకండ్ ఎడిషన్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి ఈ క్రీడా సంబరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. శుక్రవారం ప్రారంభమైన ఈ కబడ్డీ పోటీలు నాలుగు రోజుల పాటు కొనసాగనున్నాయి. రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి సుమారు 60 జట్లు ఈ పోటీల్లో తమ ప్రతిభను చాటుకోనున్నాయి. ప్రారంభోత్సవ సందర్భంగా మంత్రి స్వయంగా క్రీడాకారులతో కలిసి కబడ్డీ ఆడి అందరినీ ఉత్సాహపరిచారు. మంత్రి వాకిటి "నేను చిన్నతనంలో ఈ మట్టిలోనే ఆడి పెరిగాను. ఇక్కడే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించుకోవడం నాకు ఎంతో గర్వకారణం" అని మంత్రి భావోద్వేగంతో పేర్కొన్నారు. మక్తల్‌లో 25 కోట్ల రూపాయల వ్యయంతో అత్యాధునిక స్టేడియాన్ని త్వరలోనే నిర్మించబోతున్నట్లు ప్రకటించారు. గ్రామీణ క్రీడాకారులను వెలికితీసేందుకు ప్రభుత్వం నూతన 'స్పోర్ట్స్ పాలసీ'ని తీసుకొచ్చిందని, బడ్జెట్‌లో క్రీడలకు భారీగా నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారుల ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని, అంతర్జాతీయ స్థాయిలో రాణించే వారికి 3 కోట్ల రూపాయల పారితోషికం అందిస్తున్నామని వెల్లడించారు. క్రీడాకారుల వైద్య అవసరాల కోసం గచ్చిబౌలిలో 25 కోట్ల రూపాయలతో ప్రత్యేక ఆసుపత్రిని ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్, ఎస్పీ వినీత్ రాజ్, మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ మానస హన్మంతు, వైస్ చైర్ పర్సన్ శైవీ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రాధా లక్ష్మా రెడ్డి మరియు జిల్లా క్రీడా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు మీడియా అక్రిడిటేషన్ కార్డుల జారీ

## ప్రత్యేక కమిషనర్ శ్రీమతి సి. హెచ్. ప్రియాంక



**నేటి సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జి.ఓ. ఎం.ఎస్. నం. 252 ప్రకారం రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులకు మీడియా అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు సమాచార & ప్రజా సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ శ్రీమతి సి. హెచ్. ప్రియాంక తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుండి ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, ఫ్రీలాన్స్ మరియు అనుభవజ్ఞులైన జర్నలిస్టులు ప్రత్యేక పోర్టల్ iprtelanganagovin ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె వెల్లడించారు. దరఖాస్తుల స్వీకరణ మరియు కార్డుల జారీ ప్రక్రియ రోలింగ్ ప్రాతిపదికన కొనసాగుతుందని పేర్కొన్నారు. దరఖాస్తు ప్రక్రియలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే, దరఖాస్తుదారులు కార్యాలయ వేళల్లో (ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు) 9154170881 నంబర్‌లో మీడియా రిలేషన్స్ వింగ్‌ను సంప్రదించవచ్చని ప్రత్యేక కమిషనర్ శ్రీమతి సి. హెచ్. ప్రియాంక తెలిపారు. అర్హులైన జర్నలిస్టులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

# బాల్యవివాహాలను నిర్మూలించడానికి సహకరించండి

## ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్



**నేటి సాక్షి తిరుమలాయపాలెం (మెట్టు రుద్రరాజు):** బాల్య వివాహాలను నిర్మూలించడానికి మండల ప్రజల సహకరించాలని తిరుమలాయపాలెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ సిలార్ సాహెబ్ కోరారు

యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సేవా సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహ నిర్మూలన ప్రచార రథాన్ని మండలంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలను చేయడం వలన బాలల యొక్క భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేసిన వారం అవుతామని అన్నారు బాలివివాహాలను చేయడం వలన అనేక రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయని ఆడపిల్లలకు ఇది శాపమని పేర్కొన్నారు బాల్య వివాహ నిరోధక చట్టం ప్రకారం 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే బాలికకు 20 సంవత్సరాలు నిండిన తర్వాతనే మగ వ్యక్తికి వివాహం చేయాలని అలాకాని ఎడల ఈ చట్టం ప్రకారము చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు ప్రజలు నాయకులు తల్లిదండ్రులు ఇలా సమాజంలో ప్రతి ఒక్కరూ ఆలోచించాలని విద్యావంతులైన యువతీ యువకులను భారతదేశానికి అందించాలంటే బాల్యవివాహాలను కూడా నిర్మూలించాలని ఆయన నొక్కి వక్కాణించారు. ఎయిడ్ సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ బాల్య వివాహరహిత ఖమ్మం జిల్లా కై ప్రచారట దాన్ని గత వారం రోజులుగా జిల్లా అంతటా విస్తృత ప్రచారం చేస్తున్నామని జిల్లాలోని 21 మండలాలలో ఈ ఈ రథయాత్ర జరుగుతుందని తెలిపారు కావున ప్రజలందరూ సహకరించి బాల్య వివాహ రహిత ఖమ్మం జిల్లాను 2030 లోపే నిర్మించాలని పిలుపునిచ్చారు

ఈ కార్యక్రమంలో ఎయిడ్ సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె శ్రీనివాస్ సభ్యులు రవీందర్ ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ప్రజల చిరకాల కోరిక నెరవేరిన చారిత్రాత్మక రోజు

- బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భాష బోయిన వీరన్న



**నేటిసాక్షి, తిరుమలాయపాలెం (మెట్టు రుద్రరాజు):** దశాబ్దాల తెలంగాణ ప్రజల చిరకాల కోరిక నెరవేరిన చారిత్రాత్మక రోజు. కె. చంద్రశేఖర్ రావు ఆమరణ నిరాహార దీక్ష, ఆయన రాజకీయ చాణక్యం, విద్యార్థుల బలిదానాలు, సకలజనుల సమ్మె వంటి ఉద్యమాల ఫలితంగా రాజ్యసభలో తెలంగాణ బిల్లు పాస్ అయిన రోజు ఈ రోజు. తిరుమలాయపాలెం మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భాషబోయిన వీరన్న మాట్లాడుతూ: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావించి నేటికి 12 యేండ్లు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో అభివృద్ధికి దూరంగా అన్ని విధాలుగా వంచించబడి, అవమానింపబడిన తెలంగాణ ప్రజలు స్వతంత్ర పాలనతో విముక్తి పొందిన రోజు ఇది. స్వరాష్ట్ర సాధన తర్వాత సొంత పరిపాలనలో 10 సంవత్సరాలలో దేశం మొత్తం దృష్టిని ఆకర్షించేలా అభివృద్ధి చేసి, ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా పెట్టుబడులు తీసుకొచ్చిన ఘనత మన కేసీఆర్ ది. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను గాలికి వదిలేసి నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తూ, ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతూ రాష్ట్రాన్ని కుంటుపడేలా చేస్తోంది. కక్ష సాధింపు రాజకీయాలు మానుకొని, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం నిజాయితీగా పని చేయాలి. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ఆయన అన్నారు ఊరు ఊరు, వాడ వాడ కేసీఆర్ పాలన కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. మళ్లీ వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే కావాలని ప్రజల మనసులో ఉంది అని అన్నారు.

# పత్తి కొనుగోలు గడువును మార్చి 20 వరకు పొడిగించాలి

- నియోజకవర్గ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ విజ్ఞప్తిపై జిల్లా కలెక్టర్ కె. హరిత సానుకూల స్పందన



**నేటి సాక్షి కొమరం భీమ్ ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని రైతుల విజ్ఞప్తి మేరకు సీసీఐ (CCI) ద్వారా పత్తి కొనుగోలు గడువును మార్చి 20 వరకు మరో నెల రోజులు పొడిగించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ కోరారు. శుక్రవారం ఆయన మార్కెట్ కమిటీ చైర్మన్ మంగతో కలిసి జిల్లా కలెక్టర్ కె. హరితను మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శ్యామ్ నాయక్ మాట్లాడుతూ, ప్రస్తుత నిబంధనల ప్రకారం సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు గడువు ముగియనున్నదని తెలిపారు. నియోజకవర్గంలో సుమారు 90 శాతం మంది రైతులు పత్తి సాగుపైనే ఆధారపడి ఉన్నారని పేర్కొన్నారు. ఇంకా రైతులు తమ పత్తి పంటను కోత దశలోనే ఉన్నారని, తక్కువ సమయం కారణంగా రైతులు తమ పంటను అమ్ముకోలేక ఇబ్బందులు పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని ఆసరాగా చేసుకుని దళారులు తక్కువ ధరకే పత్తిని కొనుగోలు చేసే ప్రమాదం ఉందని పేర్కొంటూ, రైతుల ప్రయోజనాల దృష్ట్యా కొనుగోలు గడువును మార్చి 20 వరకు పొడిగించాలని కోరారు. రైతుల విజ్ఞప్తిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని శ్యామ్ నాయక్ తెలిపారు. ఈ విషయాన్ని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, గడువు పొడిగింపునకు తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వర్గల్ శ్రీ విద్యా సరస్వతి క్షేత్రంలో మహా భోజనశాల ప్రారంభం



**నేటి సాక్షి గజ్వేల్ :** ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన వర్గల్ శ్రీ విద్యా సరస్వతి దేవాలయంలో భక్తులకు నిరంతరం మహా ప్రసాదం అందించేందుకు నిర్మించిన శ్రీ విద్యా సరస్వతి అన్న ప్రసాద వితరణ (మహా భోజనశాల) కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి మాట్లాడుతూ, శ్రీ విద్యా సరస్వతి స్వరూపమైన అన్నపూర్ణాదేవి సంపూర్ణ ఆశీస్సులతో అన్నదాన కార్యక్రమం కొనసాగుతున్నట్లు తెలిపారు. భక్తుల పాలిట అమ్మవారు కొంగుబంగారంగా, కల్పతరువులా ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపుతున్నారని పేర్కొన్నారు. విశ్వంలోని సమస్త జీవులకు పోషణ బాధ్యతలు నిర్వహించే తల్లిగా అన్నపూర్ణాదేవి నిలుస్తారని, "అన్న" అంటే ఆహారం, "పూర్ణ" అంటే సంపూర్ణమని వివరించారు. ఆకలి తీర్చే శక్తికి ప్రతీకగా అమ్మవారు ప్రసిద్ధి చెందారని చెప్పారు. దాతల సహకారం, భక్తుల ఆదరణతో వర్గల్ క్షేత్రం అక్షయపాత్రగా వర్ధిల్లుతోందని, తెలంగాణ జిల్లాల్లోనే సుప్రసిద్ధ ఆలయంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, దాతలు, భక్తులు పాల్గొన్నారు.

# రాజ్యసభలో తెలంగాణ బిల్లు ఆమోదానికి 12 ఏండ్లు



**నేటి సాక్షి గజ్వేల్:** రాజ్యసభలో తెలంగాణ బిల్లు ఆమోదం పొందిన చారిత్రక రోజుకు 12 సంవత్సరాలు పూర్తయ్యాయని బీఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్ & ఏజెడ్ ఫౌండేషన్ చైర్మన్ జుబైర్ పాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విడుదల చేసిన ప్రకటనలో తెలంగాణ రాష్ట్ర సాధనలో జరిగిన ఉద్యమాలను స్మరించుకున్నారు. తెలంగాణ సాధనలో కెసిఆర్ ఆమరణ నిరాహార దీక్ష, రాజకీయ చాణక్యం, విద్యార్థుల బలిదానాలు, సకల జనుల సమ్మె వంటి ఉద్యమాలు కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. దశాబ్దాల పాటు కొనసాగిన పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతం అభివృద్ధి పరంగా వెనుకబడిందని, స్వరాష్ట్ర సాధనతో ప్రజలకు స్వయంపాలన సాధ్యమైందని చెప్పారు. గత పదేళ్ల స్వంత పరిపాలనలో రాష్ట్రం దేశవ్యాప్తంగా అభివృద్ధి పరంగా ప్రత్యేక గుర్తింపు సాధించిందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షిస్తూ పరిశ్రమలు, ఐటీ, వ్యవసాయం రంగాల్లో రాష్ట్రం పురోగతి సాధించిందని పేర్కొన్నారు. తెలంగాణను అభివృద్ధి పథంలో నిలిపిన నాయకత్వాన్ని ప్రజలు గుర్తుంచుకుంటారని తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేసిన ఆయన, పాలనలో లోపాలు ఉన్నాయని, ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేయడం తగదని అన్నారు. రాజకీయ విభేదాలకు అతీతంగా రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేయాలని సూచించారు. ప్రజలు అన్నింటిని గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందనే నమ్మకాన్ని జూబేర్ పాషా వ్యక్తం చేశారు.

# ఎంపీ నిధుల నుండి బోర్లు మంజూరు



**నేటి సాక్షి, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండలం లోని గునుకుల కొండాపూర్ గ్రామ పరిధిలోని మోత్కులపల్లి అరె క్షత్రియ భవనం దగ్గర బోరు బావి వడ్డెర కాలనీలో బోరు బావి.ప్రతేక పూజలు చేసి ప్రారంభించిన సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ. బోర్లు వేయించడం జరిగింది కరీంనగర్ ఎంపీ. కేంద్ర మంత్రి వర్యులు బండి సంజయ్ ఎంపీ నిధుల నుండి 5 లక్షల రూపాయల వరకు రెండు వేయించడం జరిగింది నీళ్లు లేకపోవడం వలన ఎండాకాలంలో కరువు పరిస్థితి దుష్టులు పెట్టుకొని ముందుగానే ఎంపీ నిధుల ద్వారా రెండు బోర్లు వేయించడం జరిగింది గునుకుల కొండాపూర్ గ్రామ ప్రజలు పక్షాన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు ఉప సర్పంచ్ రాజు వార్డు సభ్యులు కొరివి నాగమ్మ కార్యదర్శి రాజేష్ పరశురాములు సాయి తేజ సొల్లు హరీష్ బూట్ల సంపత్ టెక్నికల్ అసిస్టెంట్ అనుమండ్ల యాదగిరి ఆరే సంఘం అధ్యక్షులు సింధు సత్తయ్య సింధు తిరుపతి డాక్టర్ వీరేశం రమేష్ పుష్ప తదితరులు పాల్గొన్నారు

